## 91. సమయం

ఓ స్వామి ఆధ్యాత్మిక ప్రసంగంలో ఇలా చెప్పాడు.

"మనకి ఈ రోజుల్లో ఇతరులకి సహాయం చేయడానికి సమయం చిక్కదు. కనీసం కష్టంలో వున్నవారికి వారి కష్టాలు తీరి మంచి జరగాలన్న బలమైన భావన మనం కలిగి వున్నా చాలు. అది వాళ్ళ బాధలు తీరడానికి సహాయం చేస్తుంది."

ప్రసంగానంతరం స్వామితో సహ అంతా భోజనానికి కూర్చున్నారు. అయన ప్రసంగం విన్న వంటవాడు స్వామి విస్తరిలో చిన్న చిన్న కాగితాలని వడ్డించాడు. వాటి మీద 'చక్కగా వుడికిన అన్నం, కమ్మటి కూర, జీడిపప్పు పాయసం, చిక్కటి పెరుగు' అని వివిధ ఆహార పదార్థాల పేర్లు రాసి వున్నాయి.

"ఇవేమిటి? నన్ను అవమానిస్తున్నావా?" కోపంగా అడిగాడు స్వామి.

"లేదు స్వామి. నాకు చెయ్యి నొప్పిగా వుంది కాబట్టి మీ అందరి కడుపులు నిండాలన్న బలమైన భావనతో ఆ కాగితాల మీద నేను వండాలనుకున్న వాటి పేర్లు రాసి వడ్డించాను. ఇతరులకి సహాయం చేయడానికి మనకి సమయం లేనప్పుడు భావన వాళ్ళ కష్టాలని తీరుస్తుందని ఇందాక మీ ప్రసంగంలో చెప్పారు. ఆ ప్రకారం మీ కడుపులు నిండుతాయి కదా." జవాబు చెప్పాడు వంటవాడు.

మనం మన కాలాన్ని ఇతరులకి సహాయం చేయడానికి వెచ్చిస్తే తప్ప మనకి చిత్తశుద్ధి కలిగి, ఆధ్యాత్మిక ప్రగతి వుండదు.

## 92. చీకటి - వెలుగు

చాలా కొండ గుహల్లా ఆ గుహలో కూడా కటిక చీకటి. దాని జీవితకాలంలో అది చీకటిని తప్ప మరేదీ ఎరగదు.

ఓ రోజు దానికో కంఠం వినిపించింది.